సచివాలయ వ్యవస్థకు గ్రహణం!

- వలు సేవలు నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- మళ్లీ మండల కేంద్రాలకు జనం పరుగులు



యండపల్లిలో సచివాలయ భవనం



కోదండరామపురంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీరు(పాతచిత్రం)

కోటవురట్ల: మహాత్ముని ఆశయ సాధనలో భాగంగా గ్రామ స్వరాజ్యం దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పల్లెలు అభివృద్ధి చెందేలా ప్రజల వద్దకే పాలనను తీసుకెళుతూ గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. వ్యయ ప్రయాసలతో మండల కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే అన్ని సేవలు అందేలా రూపకల్పన చేశారు. మరోవైపు సచివాలయ వ్యవస్థతో లక్షలాది మందికి ఉపాధి కల్పించారు. ఉద్యోగ కల్పన చేశారు. వలంటీరు వ్యవస్థతో గడపకే సేవలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకున్నారు.

అంతకు మించి అంటూ మోసపూరిత హామీలు గుప్పించి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజల నెత్తిన శఠగోపం పెట్టింది. సచివాలయ సేవలను తొక్కిపెట్టి వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. సచివాలయంలో ఇప్పటికే పలు సేవలను నిలిపి వేశారు. దాంతో గ్రామీణులకు మళ్లీ ఇక్కట్లు మొదలయ్యాయి. పలు సేవలకు కోత **పెట్టడంతో మళ్లీ ప్రభుత్వ** కార్యాలయాల చుట్టూ **తిరిగే రోజులు మొదలు** కానున్నాయి. రేషన్‌కా**ర్డులు, కొత్త పింఛన్లు, ఆరో**గ్యశ్రీ కార్డులు, రైతు భరోసా వంటి వెబ్ సైట్లు తెరుచుకోవడంలేదు. ప్రస్తుతం సచివాలయాల్లో కుల, ఆదాయ, ఎన్‌బీ వంటి సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

గతం.. ఒక వైభోగం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిన సేవలు ఓ వైభోగమే. గ్రామీణులు శ్రమ పడకుండా ఉన్న చోటనే సేవలు అందేవి. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలు పారదర్శకంగా వారి గడపకే చేరేవి. ప్రతి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేసి సుమారు పది మంది సిబ్బందితో సమస్త సేవలు అందించారు. 50 కుటుంబాలకు ఓ వలంటీరును ఏర్పాటు చేసి ఇంటి వద్దకే అన్ని సంక్షేమ పథకాలను అందించారు. ఇలా కోటవురట్ల మండలంలో 25 పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన 19 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఇందులో 124 మంది సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేవారు. మరో 327 మంది వలంటీర్లు తమ పరిధిలోని ప్రజలకు ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను అందించేవారు. అధునాతన సచివాలయ భవనాలతో పల్లెలు పట్టణాలుగా రూపాంతరం చెందాయి. పల్లెల్లోనే సమస్త సేవలు అందడంతో స్థానికంగా వ్యాపారాలు అభివృద్ధి చెందాయి. సచివాలయాలలో సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, రెవెన్యూ, విద్యుత్ అనుసంధాన సేవలు, వివిధ ధ్రువపత్రాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు వంటి సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం రావడంతోనే గ్రామీణులకు కష్టాలు మొదలయ్యాయి. సచివాలయ సేవలకు గ్రహణం పట్టింది. వలంటీర్లను పక్కనపెట్టడంతో పాటు పలు సేవలను నిలిపివేయడంతో సచివాలయాలు వెలవెలబోతున్నాయి.

గుర్తుకొస్తున్న పాత రోజులు



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్య స్థాపన కోసం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పల్లెల్లోనే సమస్త సేవలు అందేలా చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు మండల కేంద్రాలకు రాకుండానే వివిధ సేవలు పొందేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సచివాలయాలను నిర్వీర్యం చేస్తోంది. మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయి.

– ఆర్‌ఎస్ సత్యనారాయణరాజు, మాజీ వైస్ ఎంపీపీ, తంగేడు

కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చింది..



కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చింది. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ఉన్న వ్యవస్థలను నాశనం చేస్తోంది. గ్రామీణులకు ఎంతగానో ఉపయోగపడే సచివాలయ వ్యవస్థను గాలికి వదిలేయడం దారుణం. ఇలాగైతే ప్రజలు తిరగబడే రోజులు తొందరలోనే ఉన్నాయి.

– పారువల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్, జల్లూరు

అన్ని సేవలు కొనసాగించాలి..



గ్రామ సచివాలయంలో గతంలో అందిన అన్ని సేవలను కొనసాగించాలి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా సేవలు ఆగిపోయాయని చెబుతున్నారు. దీని వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. సచివాలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలి.

– బొడ్డపాటి అనిల్‌కుమార్, సర్పంచ్, కోటవురట్ల

క్లుప్తంగా

యువతకు నైపుణ్యం పెంపు అవసరం

అచ్యుతాపురం(మునగపాక): యువతకు నైపుణ్యత మెరుగు పరుచుకునేందుకు అవసరమయ్యే శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. మంగళవారం అనకాపల్లి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ జిల్లాలో యువతకు చేపడుతున్న శిక్షణ కార్యక్రమాలను మరింత పెంచాలన్నారు. యువతలో నైపుణ్యం పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

రైతులకు డివిడెండ్ల పంపిణీ



రైతులకు డివిడెండ్లు అందిస్తున్న మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మురళీకృష్ణ

మునగపాక: రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నట్టు మునగపాక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎన్.మురళీకృష్ణ తెలిపారు. మునగపాక పీఏసీఎస్‌లో మంగళవారం రైతులకు దీపావళి కానుకగా డివిడెండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణ సదుపాయంతో పాటు బంగారు వస్తువులపై కూడా తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంఘానికి రూ.24,83,659 సంఘానికి నికర లాభం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సీఈవో ఆడారి వేణుగోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇటుక బట్టీని సందర్శించిన ఏయూ విద్యార్థులు



ఇటుక పరిశ్రమను సందర్శిస్తున్న విద్యార్థులు

మునగపాక: విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ ఆర్కిటెక్ కోర్సు విద్యార్థులు మంగళవారం మునగపాకలోని శ్రీచక్ర ఫాల్‌జీ బ్రిక్ పరిశ్రమను సందర్శించారు. ఇటుక ఎలా తయారవుతుంది. ఇందుకు ఉపయోగించే ముడి సరకుల వివరాలు, మార్కెట్‌లో సిమెంట్ ఇటుక ధర ఎంత మేర ఉంది, తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్‌బాబు, అధ్యాపకులు రాజు, భాను ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపద కేంద్రం తనిఖీ

యలమంచిలి రూరల్: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగపర్చుకోవాలని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం జిల్లా సమన్వయకర్త నాగలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని పురుషోత్తపురంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామాల్లో కేంద్రాలకు రహదారుల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి దీపిక, పంచాయతీ కార్యదర్శి, సచివాలయా సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు ప్రతిభ



రజత పతకం సాధించిన జట్టు సభ్యులతో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ పోలిరెడ్డి

యలమంచిలి రూరల్: ఇటీవల జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తమ విద్యార్థులు విశేషంగా రాణించి రజత పతకాన్ని సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విజేతలను ఆయన అభినందించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు పి.గోపి, కె.జగదీశ్ త్వరలో జాతీయ స్థాయిలో జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో ఆడేందుకు అర్హత సాధించారని ఆయన ప్రకటించారు. వారిని పీడీ వై.పోలిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

'అభిజిత్'పై చర్యలు తీసుకోవాలి

యలమంచిలి: అభిజిత్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ యలమంచిలి మండల కార్యదర్శి చింతకాయల శివాజీ కోరారు. మంగళవారం యలమంచిలి పట్టణంలో అభిజిత్ పరిశ్రమ లేఆఫ్ వెంటనే ఎత్తి వేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ అక్రమ లే ఆఫ్ ఎత్తి వేసి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు రాజు, కూర్మారావు, రాజు హనుమంతు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మెరుగైన సేవలు

మునగపాక: రైతులకు మెరుగైన సేవలందించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ అది మహేశ్వరరావు తెలిపారు. మండలంలోని పురుషోత్తపురంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వేలో లోపాలను సవరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే సమస్యలు ఉంటే రైతులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు

కోటవురట్ల: స్థానిక నవజవాన్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మజీద్ ఉస్మాన్ ఘనిని పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ 27వ తేదీ మధ్యాహ్నం అసర్ నమాజ్, ఖురాన్ పఠనం, సాయంత్రం ఫాతెహా ఖానీ, రాత్రి 8 గంటలకు ముస్లిం కాలనీ పరిసరాలలో గౌస్‌పాక్ బావుటా స్వీకరణ, రాత్రి 10 గంటలకు ప్రముఖ ముస్లిం గురువులతో ఉర్దూ ప్రసంగం, రాత్రి 12 గంటలకు మీలాద్ షరీఫ్ ఉంటాయన్నారు. 28వ తేదీన ఉదయం గౌస్ పాక్ వారి సందల్ ర్యాలీ, గౌస్ పాక్ దర్గా, నిషాని వద్ద సలాతు సలాం, ఫాతెహా ఖానీ, సర్కార్ గౌస్ పాక్ జెండా ఆవిష్కరణ, ఆమ్‌దావత్, అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.

సీసీ కాలువ పనుల పరిశీలన

పాయకరావుపేట : మండలంలోని అరట్లకోట గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన సీసీ కాలువ పనులను మంగళవారం ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ పరిశీలించారు. అనంతరం అరట్లకోట గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. నామవరం, అరట్లకోట గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దృష్టి పెట్టండి



రికార్డులు తనిఖీ చేస్తున్న నర్సీపట్నం డీఎల్‌పీవో మూర్తి

యలమంచిలి రూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, పారిశుధ్య లోపం తలెత్తకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ అధికారులు ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని నర్సీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్ఎస్ఎస్ఎన్ మూర్తి సూచించారు. మండలంలోని పోతురెడ్డిపాలెం, బయ్యవరం, ఏటికొప్పాక పంచాయతీల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లో అంతర్గత రహదారులు, పారిశుధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. గ్రామ సచివాలయాల్లో పంచాయతీల రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల పన్ను వసూళ్లను చేపడితే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక వనరులు అందుబాటులో ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి దీపిక, పంచాయతీ కార్యదర్శులు రామకోటి, డి.సత్యనారాయణ, ఎస్‌కేఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లింపుల్లో పక్షపాతం

ఆర్‌డీవోకు చందనాడ రైతుల ఫిర్యాదు




ఆర్‌డీవో రమణను కలిసి వినతిపత్రం ఇస్తున్న చందనాడ రైతులు

నక్కపల్లి: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ సేకరించిన ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న వారందరికీ నష్ట పరిహారం చెల్లించాలని చందనాడ గ్రామానికి చెందిన పలువురు రైతులు నర్సీపట్నం ఆర్‌డీవో వి.వెంకటరమణను కోరారు. మంగళవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్‌డీవోను రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, చందనాడ సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు ఆధ్వర్యంలో రైతులు కలిశారు. భూసేకరణలో చందనాడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 110, 120, 135, 165, 137, 138లలో సాగు చేసుకుంటున్న భూములు ఉన్నాయన్నారు. సర్వే సమయంలో ఈ భూములను అనుభవిస్తున్న వారందరికీ ఫొటోలు తీసి, మ్యాపింగ్ చేసి వివరాలు నమోదు చేసుకున్నారన్నారు. ఇవి ప్రభుత్వ భూములు కావడంతో నష్ట పరిహారం ఇవ్వడానికి కుదరదని చెప్పారన్నారు. తమకు నోటీసులు కూడా జారీ చేశారని రైతులు వివరించారు. తాము పలుమార్లు నష్టపరిహారం చెల్లించాలని దరఖాస్తు చేశామన్నారు. అధికారుల నుంచి ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. అయితే ఇదే సర్వే నంబర్లలో కొంత మందికి నష్టపరిహారం చెల్లించారన్నారు. సాగు చేస్తున్న తమకు కాకుండా మిగిలిన వారికి నష్టపరిహారం చెల్లించడం ఎంత వరకు సమంజసమన్నారు. గ్రామ కంఠాల్లో ఇళ్లు , పశువుల షెడ్లు నిర్మించుకున్న వారికి కూడా పరిహారం చెల్లించాలని కోరారు. రైతుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించకుండా భూములు స్వాధీనం చేసుకుంటామని అధికారులు చెప్పడం సమంజసం కాదన్నారు. తమ డిమాండ్లను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఆర్‌డీవోను కలిసిన వారిలో రైతు నాయకులు తళ్ల అప్పలస్వామి, గోవిందరావు, ఎస్.గోవిందు, రాము, రమణ మూర్తి, ఎం.బాబ్జి, తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

నక్కపల్లి: గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నర్సింహమూర్తి సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ప్రజలు అతిసార, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారన్నారు. కార్యదర్శులంతా తక్షణమే గ్రామాల్లో క్లోరినేషన్ పనులు చేపట్టాలన్నారు. వీధుల్లో చెత్త తొలగించాలని, కాలువల్లో పూడిక తీత చేపట్టాలని, రక్షిత మంచినీటి పథకాలు, బావుల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. కుళ్లిన మాంసం, చేపల విక్రయాలను నియంత్రించాలని సూచించారు. అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్‌ఎంలను అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైతే గ్రామాల్లో ప్రాథమిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. జ్వర, అతిసార బాధితులను సమీపంలో ఉన్న పీహెచ్‌సీలకు తీసుకెళ్లి వైద్యం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట: మండలంలో డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో జయప్రకాష్‌రావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు, వివిధ శాఖల్లో పని చేస్తున్న నిరక్షరాస్యులను గుర్తించి డిజిటల్ లావాదేవీలపై శిక్షణ ఇప్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో గాంధీ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో హేమలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్య, హెచ్‌డబ్ల్యూఓ విజయలక్ష్మి, ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

యలమంచిలి రూరల్: మండలంలోని లైనుకొత్తూరు, ఎర్రవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న వరి పొలాలను రైతులతో కలిసి వ్యవసాయాధికారులు పరిశీలించారు. సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని యలమంచిలి ఏవో పొలిమేర మోహన్‌రావు ఈ సందర్భంగా రైతులకు సూచించారు.

పాయకరావుపేట: వరి పండించే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏవో పి.ఆదినారాయణ తెలిపారు. మండలంలోని కేశవరం, రాజవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి చేలులో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు.

నక్కపల్లి: వరిలో సుడిదోమ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేంపాడు, కాగిత గ్రామాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. పొలాల్లోకి వెళ్లి తెగుళ్లను పరిశీలించి, నివారణ చర్యలు సూచించారు.

తెరువుపల్లి గ్రామసభలో 180 అర్జీలు



తెరువుపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వరహాలు

యలమంచిలి రూరల్: మండలంలోని తెరువుపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో స్థానికుల నుంచి 180 అర్జీలు వచ్చాయని యలమంచిలి తహసీల్దార్ వరహాలు తెలిపారు. గ్రామంలో పాల సేకరణ కేంద్రం వద్ద నిర్వహించిన గ్రామ సభలో మొత్తం 15 కేటగిరీలకు సంబంధించిన అర్జీలను రైతులు, స్థానికుల నుంచి స్వీకరించామన్నారు. రీసర్వేలో విస్తీర్ణం తేడా వచ్చిందని 74 మంది, పట్టాదారు పుస్తకాలు, రికార్డుల్లో పేర్లు సవరణ, పేర్లు తప్పుగా నమోదు కావడంపై 42 మంది, సర్వే నంబరు కోరిలేషన్ కోసం 10 మంది, వెబ్‌ల్యాండ్‌లో భూమి వివరాల నమోదు కోసం 39 మంది దరఖాస్తులు చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

అచ్యుతాపురం(మునగపాక): విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని మండల పరిషత్ ఏవో కృష్ణ పేర్కొన్నారు. మండలంలోని మల్లవరం, ఎర్రవరం పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఫణీంద్ర, శ్యామలను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు తప్పవని, ఎక్కడ పనిచేసినా ప్రజలకు మెరుగైన సేవలందించే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పిన్నమరాజు వాసు, చిన్ని శ్రీనివాసరావు, మారిశెట్టి సూర్యనారాయణ, చోడపల్లి రమణ, చల్ల సూరిబాబు, కండిపల్లి శ్రీనివాసరావు, కూనిశెట్టి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. మెయింటెనెన్స్ పనులు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఆవు పాల సేకరణ ధరను పునరుద్ధరించాలి

అచ్యుతాపురం(మునగపాక): ఆవు పాల సేకరణ ధరను తగ్గించడం సరికాదంటూ రైతులు మంగళవారం అచ్యుతాపురం మండలం ఎం.జగన్నాథపురం పాల కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. పాల సేకరణ ధర పెంచాల్సింది పోయి తగ్గించడం వల్ల రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. రైతులకు బోనస్ ఇంత వరకు అందించలేదని, పశు దాణా ధరను కూడా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పాల సేకరణ ధరను పెంచాలని, లేకుంటే అఖిల పక్ష నేతలతో కలిసి ఈ నెల 29న విశాఖ డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సంఘం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వంశీ, పీలా కాసుబాబు, భీముని నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో క్రిమి సంహారక మందుల పిచికారీ

ఎస్.రాయవరం: వరి తెగుళ్లపై రైతులు అవగాహన పెంచుకుని అవసరమైన క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలని కొక్కిరాపల్లి ఉద్యానవనశాఖ శాస్త్రవేత్త శిరీషా సూచించారు. మండలంలో మంగళవారం గెడ్డపాలెం, కొరుప్రోలు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కొరుప్రోలులో రైతు భరోసా కేంద్రంలో ఎరువులు లభ్యం కావడం లేదని అధికారులను రైతులు ప్రశ్నించారు. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి స్పందిస్తూ రైతులకు అవసరమైన ఎరువులను తీసుకొస్తున్నామని చెప్పారు. ఇటీవల పైనుంచి సరకు రావడం ఆలస్యం కావడం వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారని, బుధవారంలోపు అందరికీ సరిపడా పొటాష్ ఎరువు అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ

ఎస్.రాయవరం: పి.ధర్మవరం హైస్కూల్‌లో విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుసుమకుమారి, విమలాదేవి, శోభారాణి, ఆర్.అప్పలనాయుడు, గారా ప్రకాష్ పాల్గొన్నారు.

నేవల్‌బేస్ పనులు అడ్డుకున్న గ్రామస్తులు



అధికారులతో వాదనకు దిగిన బంగారమ్మపాలెం గ్రామస్తులు

ఎస్.రాయవరం : బంగారమ్మపాలెం మత్స్యకారులకు శాశ్వత పరిష్కారం చూపి నేవల్ బేస్ నిర్మాణాలు తమ గ్రామ పరిధిలో ఏవైనా చేసుకోవచ్చని మత్స్యకారులు స్పష్టం చేశారు. బంగారమ్మపాలెం గ్రామం సమీపంలో నేవల్ బేస్‌కి కేటాయించిన భూమి సరిహద్దుల్లో బౌండరీ ఏర్పాటు చేసేందుకు మంగళవారం మండల తహసీల్దార్, నేవీ అధికారులు బంగారమ్మపాలెం గ్రామానికి వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. సుమారు 18 ఏళ్ల నేవల్ బేస్ నిర్వాసితులుగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించకపోగా, తాము వేట చేసుకునే సముద్ర మొగ భాగం మూసేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ క్రమంలో మండల సర్వేయర్ మూర్తి గట్టిగా మాట్లాడడంతో మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కాసేపు గందరగోళ వాతావరణం నెలకొంది.ఎస్‌ఐ విభీషణరావు ఇరువురికి నచ్చజెప్పారు. గత వారం నర్సీపట్నం ఆర్డీవో గ్రామంలో నిర్వహించిన సమావేశానికి సమాధానం రాకుండా ఇప్పుడు ఈ పనులు చేయడం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని తహసీల్దార్ రమేష్ బాబు జిల్లా కలెక్టర్‌కి ఫోన్‌లో వివరించారు. బుధవారం మత్స్యకార పెద్దలు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి సమస్య చెప్పాలని అంతవరకు పనులు ఆపుతున్నట్టు చెప్పారు. దీంతో మత్స్యకారులు ఆందోళన విరమించారు.

రూ.7.46 కోట్లతో యానాద్రి కాలువ ఆధునికీకరణ



కాలువ పనుల గురించి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, రమాకుమారి

యలమంచిలి రూరల్: పట్టణంలో ప్రధాన సమస్యగా ఉన్న యానాద్రి కాలువ ఆధునికీకరణ పనుల్లో కదలిక వచ్చింది. రూ.7.46 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో మూడు దశల్లో పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చెప్పారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మున్సిపల్, జలవనరుల శాఖ అధికారులతో కలిసి ఆయన పట్టణంలో యానాద్రి కాలువను పరిశీలించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ పనులకు సంబంధించి అధికారులు డీపీఆర్ రూపొందించి ఆధునికీకరణ పనులకు ప్రతిపాదించారు. ఈ మేరకు ప్రస్తుత ప్రభుత్వం యానాద్రి కాలువ పనులను చేపట్టడానికి చర్యలు తీసుకుంటోంది. రూ.3 కోట్లతో తొలిదశ పనులు చేపట్టడానికి వీలుగా మంగళవారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అధికారులతో కాలువ ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. కాలువ గట్టును పటిష్టపర్చడానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి సూచించారు. ఇంజనీర్లు కాలువ ఆధునికీకరణకు సంబంధించిన విషయాలను ఎమ్మెల్యేకు వివరించారు. మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, జల వనరుల శాఖ డీఈఈ సాయి ప్రశాంతి, పట్టణ ప్రణాళికాధికారి శ్రీలక్ష్మి, మున్సిపల్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

మునగపాక: అరబుపాలెంను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.2 లక్షలతో తలపెట్టిన యాతపేటలో సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరబుపాలెంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలపై దృష్టి సారించామన్నారు. గ్రామంలో సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు.